జూ క్యాంటీన్ తెరిచేదెప్పుడో?

- నెల రోజుల కిందట ముగిసిన లీజు గడువు
- కొత్త టెండర్ ప్రతిపాదనకు సన్నాహాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో క్యాంటీన్ నెల రోజులుగా తెరుచుకోవడం లేదు. సుమారు నెల రోజులుగా మూతపడి ఉండడంతో జూలో సందర్శకులు ఆహార పదార్థాల కోసం ఇబ్బందిపడుతున్నారు. క్యాంటీన్ లీజు గడువు నెల రోజుల కిందట ముగిసిపోవడంతో నిర్వాహకుడు ఖాళీ చేసి వెళ్లిపోయారు. దీంతో క్యాంటీన్ నిర్వహణకు కొత్తగా లీజుకు ఇవ్వడానికి జూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ క్యాంటీన్ నిర్వహించిన ప్రైవేట్ వ్యక్తికి గత నెలతో లీజు సమయం ముగిసింది. దీంతో ఆయన ఖాళీ చేసేశాడు. జూ అధికారులు మళ్లీ కొత్తగా టెండరు పిలవాల్సి ఉంది. దీంతో పాత లీజు సమయం ముగిసినప్పటి నుంచి సుమారు నెల రోజులుగా దీనికి తాళం పడింది. దీంతో జూకు వెళుతున్న సందర్శకులు అల్పాహారం, కూల్‌డ్రింక్స్, టీ, కాఫీ తదితర ఆహార పదార్థాలు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జూలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన కేఫ్‌టేరియాలు మాత్రమే సందర్శకులకు కొంత వరకు ఉపయోగపడుతున్నాయి. వాటిలో టీ, కాఫీ, బిస్కెట్లు, సమోసాలు తదితర ఆహార పదార్థాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో క్యాంటీన్ నిర్వహణకు త్వరగా టెండరు పిలిచి కేటాయించడమో, లేదంటే జూ అధికారులే స్వయంగా నిర్వహించడమో చేయాలని సందర్శకులు కోరుతున్నారు.



జూలో మూసి ఉన్న క్యాంటీన్

టెండర్‌కు సన్నాహాలు

జూ క్యాంటీన్ లీజు గడువు గత నెలలో ముగిసింది. మళ్లీ కొత్తగా టెండర్ పిలవడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలతో నిబంధనలు ప్రకారం మరింత నాణ్యమైన ఆహారం క్యాంటీన్‌లో లభించేలా చర్యలు చేపడుతున్నాం. దీనికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం సందర్శకులకు ఇబ్బంది లేకుండా జూ లోపల రెండు చోట్ల కేఫ్‌టేరియాలు ఏర్పాటు చేశాం. కొద్ది రోజుల్లో క్యాంటీన్ కూడా అందుబాటులోకి వస్తుంది.

– నందని సలారియా, జూ క్యూరేటర్

క్లుప్తంగా

సంతపాలెంలో కార్గిల్ విజయ దివాస్



సంతపాలెం పాఠశాలలో జాతీయ జెండాలతో విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం కార్గిల్ విజయ దివాస్ నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. వారితో 'జై జవాన్, జై హిందూ'అంటూ నినాదాలు చేయించారు. ఈ సందర్భంగా జవాన్‌లు దేశానికి చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు వివరించారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం సేవ చేయాలని పిలుపునిచ్చారు. అందరూ దేశాన్ని ప్రేమించాలని కోరారు.

సిరిపురంలో డివైడర్‌ను తొలగించాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బీచ్ రోడ్డు: సిరిపురం నుంచి వీఐపీ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన డివైడర్‌ను తక్షణమే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైడర్లను ఏర్పాటు చేసేటప్పుడు శాస్త్రీయంగా పరిశీలించాలన్నారు. ఎవరికో లబ్ధి చేకూర్చే విధంగా డివైడర్లను ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ మార్గంలో డివైడర్‌ను ఏర్పాటు చేయడం వల్ల వాహనచోదకులు కాంప్లెక్స్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ వరకు వెళ్లి టర్న్ తీసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. పోలీసులు తక్షణమే డివైడర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, కేతినేని సురేంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై మాజీ సైనికులకు అవగాహన



మాట్లాడుతున్న ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో మాజీ సైనికులకు ప్రైవేటు ఆర్గనైజేషన్‌లో ఉపాధి-స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఉపాధి కార్యాలయ అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ పరిశ్రమల్లో ఉపాధి పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ ట్రేడుల్లో అవకాశాలు, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంఘాల సభ్యులు, పలు పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు భక్తులు పసుపునీళ్లతో బారులు తీరారు. అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతోపాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం జరిపారు. దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూ బజారు, నరసింహనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఎరుకుమాంబను పసుపు, కుంకుమలు, పలు రకాల పూలతో అలంకరించారు.

కోలా గురువులుకు అభినందనలు

మహారాణిపేట: డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన కోలా గురువులుకు బుధవారం పలువురు అభినందనలు తెలిపారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, నాగవంశ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డు అప్పలకొండమ్మ, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, పార్టీ నాయకుడు కృష్ణంరాజు, పార్టీ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, మారుతీ ప్రసాద్, కార్పొరేటర్లు కొఠారి అనిల్‌రాజు, కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, ఉమ్మడి స్వాతి దాస్, అక్కరమాని రోహిణి, ముర్వల లక్ష్మి, సురేష్, అప్పారి శ్రీవిద్య, గిరిబాబు, గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి, ఇన్‌చార్జిలు జగ్గుపల్లి అప్పలరాజు, పుక్కళ్ల ధనలక్ష్మి, సురాడ వెంకటలక్ష్మి, పీలా వెంకట్, పులగం శ్రీనివాసరెడ్డి, రెడ్డి వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానంద రెడ్డి, తదితరులు గురువులుకు అభినందనలు తెలిపారు.



కోలా గురువులను సన్మానిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

వీర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు సాగరతీరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ దివాస్ సందర్భంగా ఆల్ ఇండియా ఎక్స్ సర్వీసు బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ ర్యాలీ సాగింది.

గెడ్డలో పూడిక తొలగింపు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-10లోని గెడ్డలో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులు ఎట్టకేలకు జీవీఎంసీ పారిశుధ్య విభాగం చేపట్టింది. ఈ పూడిక కారణంగా వర్షపు నీరు వెళ్లే దారిలేక స్థానికంగా రహదారులు జలమయం అవుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పరిస్థితి సమస్యాత్మకంగా మారింది. మురుగునీటి ప్రవాహానికి అనుగుణంగా గెడ్డ ఉన్నప్పటికీ పూడిక తొలగించకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి సైతం వస్తుందంటూ స్థానిక ప్రజలు ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన జీవీఎంసీ యంత్రాంగం బుధవారం పెద్ద ఎత్తున పూడికతీత కార్యక్రమం చేపట్టింది. పొక్లెయిన్‌తో పూడికను తొలగించారు.



గెడ్డలో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

హిందీ పరీక్షల ఫీజు గడువు 31 వరకు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జరిగే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 31 వరకు గడువు పెంచారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశికలకు అపరాధ రుసుం లేకుండా, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారధ పూర్వార్థ, రాష్ట్రభాష విశారధ ఉత్తరార్థ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు రూ.10 అపరాధ రుసుంతో ఈ ఫీజులు చెల్లించవచ్చు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 89856 47419, 89858 97419లలో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి-భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలపై దృష్టి పెట్టండి

ఎంవీపీ కాలనీ: ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై దృష్టిసారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొందు సీతారాం జిల్లా అధికారులకు సూచించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్న రాల్లా బెల్లా స్కూల్‌ను బుధవారం ఆయన జిల్లా డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి రామారావు, జిల్లా శిశు సంక్షేమాధికారులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి సందర్శించారు. గత కొంతకాలంగా అనుమతులు తీసుకోకుండా రాల్లా బెల్లా స్కూల్ 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్న తీరును విద్యార్థుల తల్లిదండ్రులు ఆధారాలతో సహ సీతారాంకు వివరించారు. దీంతో పాఠశాల ప్రతినిధుల నుంచి స్కూల్ గుర్తింపు పత్రాలపై ఆరాతీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు ఎలా నిర్వహిస్తున్నారని పాఠశాల యాజమాన్య ప్రతినిధులను ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ డీఈవో, ఎంఈవో మాట్లాడుతూ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలా విద్యార్థులకు అందించిన ధ్రువపత్రాలు చెల్లవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని సీతారాం జిల్లా అధికారులకు సిఫార్సు చేశారు. విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారి వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



రాల్లా బెల్లా పాఠశాల గుర్తింపుపై ఆరా తీస్తున్న సీతారాం

డిపాజిట్ సొమ్ము మాయంపై ఫిర్యాదు

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి డిపాజిట్ నగదును సొంత ఖాతాలోకి వేసుకుని మోసం చేసిన ఘటన జరిగింది. కంచరపాలెం పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాంకుమార్ అనే వ్యక్తి ఖాతాదారులు డిపాజిట్ చేసిన సొమ్మును తీసుకుని వారికి రసీదులు అందించారు. పోస్టాఫీస్‌లో ఆ నగదును జమ చేయకుండా సొంత ఖాతాలోకి వేసుకున్నాడు. నగదు లెక్కలు సరిచూసుకున్న అధికారులు రూ.6 లక్షల 4 వేల తేడా రావడంతో ఉలిక్కిపడ్డారు. దీంతో వెంటనే కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం



శివాజీ పార్కు రోడ్డులో లీకవుతున్న మ్యాన్‌హోల్



మద్దిలపాలెం కూడలిలో పడుతున్న వర్షం

మద్దిలపాలెం: భారీ వర్షానికి జన జీవనం స్తంభించిపోయింది. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రశాంత వాతావరణం నెలకొనగా.. 3 గంటల ప్రాంతంతో ఒక్కసారిగా కురిసిన వర్షానికి జనం సతమతమయ్యారు. పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు, కార్యాలయాల నుంచి ఉద్యోగులు తిరిగి ఇళ్లకు వెళ్తున్న తరుణంలో భారీ వర్షం కురవడంతో ఇబ్బందులు పడ్డారు. రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి.

పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్స్

భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ లీకవుతున్నాయి. జీవీఎంసీ 22వ వార్డులో శివాజీపాలెం ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న మ్యాన్‌హోల్స్ వారం రోజులుగా పొంగిపొర్లుతున్నాయి. వీటి నుంచి వస్తున్న మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగు ఇళ్లలోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కూలిన విద్యుత్ స్తంభం, చెట్లు

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు పరిధిలో వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. లాసన్స్‌బే కాలనీలో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభంపై పడ్డాయి. దీంతో స్తంభం నేలకూలింది. పెదవాల్తేరు గ్రామంలో ఆలయం వద్దనున్న వేపచెట్టు కూలిపోయింది. స్థానిక కార్పొరేటర్ ముర్వల లక్ష్మి వెంటనే స్పందించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. సిబ్బంది వచ్చి చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



పెదవాల్తేరులో కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



లాసన్స్‌బే కాలనీలో కూలిన చెట్టు, విద్యుత్ స్తంభం

ఏయూ సమాచారమ్

ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరం

ఏయూ క్యాంపస్ : ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏపీ ర్యాగింగ్ నిషేధ చట్టం 1997 గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలను తెలియజేశారు. అదే విధంగా యువత వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మోటారు వాహన చట్టాలు, తాజాగా వచ్చిన మార్పులు వివరించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాము మాట్లాడుతూ నగరంలో ర్యాగింగ్, మత్తు పదార్థాలకు సంబంధించి గతంలో నమోదైన కేసులు, పర్యవసానాలు వివరించారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉంటూ తమ ఉన్నత భవిష్యత్‌ని పదిలం చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఏయూ ఇంజినీరింగ్ కళాశాలను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దామన్నారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడం, నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసాద్, ఆచార్య ఎస్.పాల్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ

అవిశ్రాంత సేవకులు



విరిగిన చెట్ల కొమ్మలు తొలగిస్తూ..



ఇళ్ల నుంచి వ్యర్థాలను సేకరిస్తూ..

ప్రజారోగ్యమే ధ్యేయంగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతున్నా పారిశుధ్యం మెరుగుకు విశేషంగా పాటు పడుతున్నారు. స్థానిక 20వ వార్డులో వర్షాల కారణంగా విరిగిన చెట్ల కొమ్మలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. అదే విధంగా ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ, రోడ్డ పక్కన పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, తరలించడం చేస్తున్నారు. రోడ్లు శుభ్రం చేయడం, కాలువల్లో పూడిక తీత పనులు జోరు వానలోనూ చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా, దోమల బెడద పెరగకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

– ఏయూ క్యాంపస్

ఓటరు జాబితా ఇంటింటి సర్వే తనిఖీ

బీచ్ రోడ్డు: నగరంలోని 220, 221, 223, 248 పోలింగ్ కేంద్రాల పరిధిలో శ్రీనగర్, బాలాజీనగర్, నెహ్రూబజార్, చైతన్య నగర్లలో జరుగుతున్న ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాపై ప్రభుత్వం ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టనుంది. ఈ సర్వేను తనిఖీ చేసిన జేసీ బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దిష్ట కాలపరిమితిలో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తిగా సమాచారం సేకరించిన వివరాలను బుక్‌లో నమోదు చేసుకోవాలని, అదే సమయంలో ఆన్‌లైన్‌లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఓటరు జాబితాలో వివరాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



సర్వేను తనిఖీ చేస్తున్న జేసీ విశ్వనాథన్

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

సింహాచలం: సింహగిరి ఆధ్యాత్మిక సిరిని సంతరించుకుంది. సింహగిరిపై బుధవారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున నృసింహ హోమం జరిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి తిరువీధి ఉత్సవంతో కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి, అక్కడున్న హోమగుండం వద్ద కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్నికార్యం అనంతరం నృసింహ హోమం నిర్వహించారు.



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామంపడపలో స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు.

విక్టోరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా (ఘోష) ఆస్పత్రి అభివృద్ధికి వైజాగ్ రౌండ్ టేబుల్ ఎంతో సహకరిస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 చైర్మన్ ఎం.తేజ, వైజాగ్ లేడీస్ సర్కిల్ 201 అధ్యక్షురాలు శ్వేత జోష్ తెలిపారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఉష మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జి. మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది వైజాగ్ రౌండ్ టేబుల్ 77 అయిదు సంవత్సరాల పాటు ఆస్పత్రి కోసం ఏడాదికి రూ. 30 లక్షలు విరాళంగా ఇస్తామని ప్రకటించిందని అన్నారు. ఈ ఏడాది ల్యాప్రోస్కోప్‌ను ఆస్పత్రికి ఇస్తామని హామీ ఇచ్చా రని వివరించారు. వైజాగ్ రౌండ్ టేబుల్ 77 చైర్మన్ ఎం.తేజ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ఎలాంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహిస్తారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.